జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేస్తాం..

– మంత్రులు పొంగులేటి, తుమ్మల హామీ

మంత్రులు పొంగులేటి, తుమ్మలను కలిసిన జర్నలిస్టులు

ఖమ్మం, నవంబర్ 24 : ఖమ్మం నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టు లందరికీ ఇళ్ల స్థలాలను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మూడు జర్నలిస్టు యూనియన్లు టీయూడబ్ల్యూజే(ఐజేయూ), టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) టీడబ్ల్యూజేఎఫ్(ఫెడరేషన్) ఆధ్వర్యంలో స్తంభాద్రి జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ఇద్దరు మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను వీలైనంత తొందరగా అందించాలనే కృతనిశ్చయంతో ఉందన్నారు. జర్నలిస్టుల బృందం కలిసిన వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల కలెక్టర్‌కు ఫోన్ చేసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని అదేశించారు. మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించారు. సొసైటీకి అదనంగా కేటాయించాల్సిన 8 ఎకరాల స్థలం సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కే.రాంనారాయణ, వనం వెంకటేశ్వర్లు, ఆకుతోట ఆదినారాయణ, రాము, కనకం సైదులు, వెన్నబోయిన సాంబశివరావు, మైసా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి రోడ్డు పనులు పూర్తిచేయాలి

– మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబర్ 24 : ఉగాది నాటికి వెలుగుమట్ల అర్బన్ పార్కు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్‌లో మంత్రి పర్యటించి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలుగుమట్ల అర్బన్ పార్కు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించి వారి నుంచి ఫీజులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మేయర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ రావూరి కరుణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

‘రోల్డ్’తో ‘గోల్డ్’రుణాలు!

- బ్యాంకర్లను బురిడీ కొట్టించిన కేటుగాళ్లు
- అంతర్గతంగా కొనసాగుతున్న విచారణ
- అదుపులో కొందరు.. పరారీలో మరికొందరు..
- అధికారులు నోరు విప్పితేనే నిజాలు తెలిసే చాన్స్..

ఖమ్మం డీసీసీబీ బ్యాంక్ (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 24:నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన ఉదంతం ఖమ్మం నగరంలోని పలు బ్యాంకులలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాదాపుగా మూడు నెలల నుంచి కేటుగాళ్లు పక్కా ప్లాన్‌తో బ్యాంకు అధికారులను బురిడీ కొట్టించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు సంబంధిత బ్యాంకు అధికారులు ఎక్కడా అధికారికంగా నోరు మెదకపోయినప్పటికీ మోసపోయిన తీరు మాత్రం నగరంలో ఆనోటా ఈనోటా విన్పిస్తోంది. డీసీసీబీ విషయం మాత్రమే బయటకు వచ్చినప్పటికీ మరో రెండు అగ్ర బ్యాంకులు, ఓ గ్రామీణ బ్యాంకుల బ్రాంచీల అధికారులు సైతం ఈ కేటుగాళ్ల ప్లాన్‌లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

ఖమ్మం డీసీసీబీలో కొద్ది నెలలుగా అనేక ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం విదితమే. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజులకే డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల తొలగింపు మొదలు డీసీసీబీలో అనేక ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొద్దిరోజులపాటు పాలకవర్గ సభ్యులు, ఇన్‌చార్జి చైర్మన్ మధ్య పొరపచ్చాలు వచ్చాయి. అవి సద్దుమణిగాయో లేదో.. బ్యాంకు ఉన్నత శ్రేణి కార్యదర్శితోపాటు మరో ఇద్దరు జనరల్ మేనేజర్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో డీసీసీబీలో భారీ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇది చాలదన్నట్లుగా పక్షం రోజుల క్రితం ఫేక్ భూమి పట్టాలతో కొందరు అక్రమార్కులు భారీగా రుణాలు పొందిన విషయం బయటకు వచ్చింది. ఆ వెంటనే ఓ మేనరల్ మేనేజర్ స్థాయి అధికారి సస్పెండ్ అయ్యారు. ఇలా ఖమ్మం డీసీసీబీలో ఆరు నెలలుగా వరుస ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇవి చాలవన్నట్లు తాజాగా నకిలీ బంగారం తాకట్టు పెట్టుకొని భారీగా రుణాలు తీసుకున్న ఘటన మరింత కలవరపెడుతోంది. అయితే డీసీసీబీతోపాటు ఖమ్మం నగరంలోని మరో మూడు నాలుగు బ్యాంకుల్లో కూడా ఇదే తరహా మోసం జరిగినట్లు తెలుస్తోంది.

బ్యాంకు అధికారుల అంతర్గత విచారణ

నాలుగు రోజుల క్రితం ఖమ్మంలోని ఓ గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారంతో చేయించిన చేతి కడియం పెట్టి కొందరు వ్యక్తులు బంగారు రుణాలు తీసుకున్నట్లు అక్కడ పనిచేసిన సిబ్బంది గుర్తించారు. ఈ విషయంపై డీసీసీబీలో పనిచేస్తున్న తమ సన్నిహితులకు హెచ్చరించారు. దీంతో కొందరు డీసీసీబీ సిబ్బంది అప్రమత్తమై సదరు చిరునామాల ఆధారంగా ఆరా తీయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో చిరునామాల ఆధారాలు సరిపోలడంతో తాము కూడా మోస పోయినట్లు గుర్తించారు. దీంతో తాకట్టు పెట్టుకున్న చేతి కడియాలను మరో అప్రైజర్‌తో పరీక్ష చేయించగా అవి నకిలీవని తేలింది. గ్రామీణ బ్యాంకు, డీసీసీబీతోపాటు మరో రెండు జాతీయ బ్యాంకుల్లోనూ సదరు వ్యక్తులు ఇదేతీరుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులు తొలుత అంతర్గత విచారణ చేపట్టారు. డీసీసీబీలో ఒక బ్రాంచీలో ఫేక్ ఐడీలతో రుణాలు పొందిన కేటుగాళ్లు.. నగరంలోని మరో మూడు బ్రాంచీల్లోనూ ఇదే చిరునామాలతో రెండు నెలల కాలంలో అనేకమార్లు రుణాలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కొందరిని గుర్తించగా.. విషయం తెలసుకున్న మరికొందరు పారిపోనట్లు తెలుస్తోంది. కేవలం డీసీసీబీ పరిధిలోనే ఆరు చిరునామాలతో దాదాపుగా రూ.30 లక్షల రుణాలు పొందినట్లు సమాచారం.

అధికారులు నోరు విప్పితేనే నిజాలు బయటకు..

ఖమ్మంలోని పలు బ్యాంకుల్లో నకిలీ బంగారం తాకట్టు పెట్టి కొందరు కేటుగాళ్లు భారీగా రుణాలు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. శని, ఆదివారాలు సెలవులు కావడంతో అధికారులు కార్యాలయాల్లో కన్పించలేదు. ఖమ్మంలో చోటు చేసుకున్న ఈ పరిణామాలపై ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగింది. అయితే జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈ విషయంపై స్పష్టత ఇవ్వలేదు. వివరణ కోసం మీడియా ప్రతినిధులు సంప్రదించినప్పటికీ ఫోన్‌కు స్పందించడం లేదు. కాగా, డీసీసీబీతో ఇతర బ్యాంకుల అధికారులు కూడా ఈ ఘటనపై గోప్యత పాటిస్తున్నారు. సోమవారం బ్యాంకులు పునఃప్రారంభం కానున్నందున ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, తీసుకున్న రుణాలను రెండు రోజుల్లో చెల్లిస్తామంటూ ఇప్పటికే కొందరు కేటుగాళ్లు సంప్రదించినట్లు, ఈ మేరకు ఆ కేటుగాళ్ల నుంచి కొందరు అధికారులు ప్రామిసరీ నోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది.

కనుల పండువగా మహా రుద్రయాగం

ఖమ్మంలో జరుగుతున్న సహస్ర చండీసహిత మహారుద్ర యాగం

ఖమ్మం సిటీ, నవంబర్ 24 : నగరంలోని మమత రోడ్, ఫైవ్ ఎలిమెంట్స్ పక్కన గల బహిరంగ ప్రదేశంలో శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన సహస్ర చండీ సహిత మహారుద్ర యాగం కనుల పండువగా కొనసాగుతోంది. ఐదురోజులపాటు యాగం జరుగుతుందని నిర్వాహకులు కోరారు. కార్యక్రమాన్ని యాగ బ్రహ్మ రాజోలు భాను రవికిరణ్‌శర్మ నిర్వహించగా యాగకర్త దండ్యాల లక్ష్మణ్‌రావు దంపతులు, స్థల దాత గుర్రం మురళీ దంపతులు, యాగం సంకల్ప పిత భవ్యశ్రీ వృద్ధాశ్రమం, జ్యోతిష్యాలయం సునీతమాత, నిర్వాహకులు వెంపటి సత్యనారాయణ దంపతులు, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

నేటినుంచి బీచ్ వాలీబాల్, లాన్ టెన్నిస్ ఎంపికలు

ఖమ్మం సిటీ, నవంబర్ 24 : ఉమ్మడి ఖమ్మంజిల్లా బాలబాలికల ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 బీచ్ వాలీబాల్, లాన్ టెన్నిస్ ఎంపికల పోటీలు సోమవారం నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతాయని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విద్యాశాఖ అధికారులు సోమశేఖరశర్మ, ఎం.వెంకటేశ్వరాచారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10గంటల్లోపు స్టేడియం వద్ద సంప్రదించాలని కోరారు. 6వ తరగతి నుంచి ఆపైన చదివే వారు అర్హులని ప్రధానోపాధ్యాయుల నుంచి స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు. ఇంటర్ చదువుతున్న క్రీడాకారులు పదో తరగతి మెమో, కాలేజీ నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్స్ సమర్పించాలన్నారు. పోటీలను ఇరు జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కే నరసింహమూర్తి, వాసిరెడ్డి నరేష్ కుమార్ పర్యవేక్షిస్తారని పూర్తి వివరాలకు 8019952592, 7989731339 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వరరావు

ఖమ్మం కమాన్‌బజార్, నవంబర్ 24 : మహాత్మగాంధీ చెప్పినట్లు రాజ్యం, మతం ఒక్కటికాదని ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి, ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వరరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బీజాలు వేయాలన్నారు. భారత రాజ్యాంగం మతం కాదన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకమన్నారు. సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తుందన్నారు. మరో రెండు రోజుల్లో భారత రాజ్యాంగ స్వర్ణోత్సవాలు జరగనున్న నేపథ్యంలోఈ ఆత్మీయ సమ్మేళనం ఓ చారిత్రకతను సంతరించుకుందన్నారు. మత విద్వేషాలకు వ్యతిరేకంగా సమ్మేళనం ఒక అంకురార్పణ కావాలన్నారు. భారత రాజ్యాంగం మతానికి వ్యతిరేకం కాదన్నారు. రాజ్యాంగ పరమైన అలోచనలను కల్పించడానికి ఈ సమ్మేళనం దోహదపడితే ఇది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనంతరం ఆ సంఘం ఉమ్మడి ఏపీ మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, లింగాల కమల్‌రాజ్ మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకట్, సాయిబాబా, పోతినేని సుదర్శన్, సుబ్బరావు, ఎస్‌డీ జావీద్, వెల్లంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, ఇతిహాసాలపై దృష్టి సారించాలి

– కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, నవంబర్ 24 : నెలనెలా వెన్నెల లాంటి కార్యక్రమాల్లో యువతరాన్ని భాగస్వామ్యం చేసి సంస్కృతి, ఇతిహాసాలపై దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ‘నెలనెలా వెన్నెల’ అభ్యుదయ సాంస్కృతిక కదంబ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్, టీవీలు వచ్చిన తర్వాత మన సంస్కృతి, మన ఇతిహాసాలపై దృష్టి తగ్గిపోయిందన్నారు. నాగబత్తిని మాలతి వర్ధంతి సందర్భంగా పేద మహిళలకు చీరెలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. నాగబత్తిని మాలతి జీవిత సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ వనం కృష్ణవేణికి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో నాగబత్తిని రవి, నాగబత్తిని రాజాచైతన్య, మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, వేల్పుల విజేత, వనం సమ్మయ్య, కోన జనార్దన్‌రావు, మోత్కూరి గోపాలరావు, నాగబత్తిని భాస్కరరావు, కట్టా కృష్ణార్జునరావు, ఈశ్వరప్రగడ రంగనాథ్, కళాభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

జన భోజనాలు కొనసాగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీ

ఖమ్మం, నవంబర్ 24 : కార్తీకమాసంలో జరిగే వన భోజనాలు కుల భోజనాలుగా మారాయని, కుల భోజనాలు కాకుండా జన భోజనాలు కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఐదో డివిజన్ యూపీహెచ్ కాలనీలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీన బల్లేపల్లి మామిడితోటలో జన భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీహెచ్ శిరోమణి, శ్రీనివాస్, లెనిన్, వెంకటేశ్వర్లు, భరత్, ధరణి, కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు



పర్సనల్ ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అం తకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

స్కోర్ పెంపునకు మార్గాలు

సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

పరిమితంగా రుణాలు

రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

అప్పుల అన్వేషణ వద్దు

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

పొరపాట్లను సరిచేయాలి

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.



గ్యారంటీలకు దూరంగా..

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.

పిల్లల విద్య కోసం..

పిల్లల విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



హైబ్రిడ్ ఫండ్స్

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

విద్యా పథకాలు

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

విద్యా రుణాలు

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

బీమా ప్లాన్లు

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

ఒక కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

ఈటీఎఫ్‌ల ద్వారా..

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

ఈక్విటీ ఎంఎఫ్‌లు

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

ఒడిదొడుకుల్లోనే పయనం

దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఎక్కువగానే ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300-24,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.